
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్



సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహణ అన్యాయం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి కడప అర్బన్

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించాలన్న నిర్ణయం అన్యాయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అనేక సంవత్సరాల నుంచి విద్యా బోధన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరడం అంటే అనుభవం అర్హత, వారి సామర్థ్యాన్ని నిరూపించుకుని ఉద్యోగం పొందడమని తెలిపారు. ఇప్పుడు టెట్ పరీక్ష బలవంతంగా పెట్టడం అంటే వారి సేవలను అవమానించడమే అని చెప్పారు. ఉపాధ్యాయులను అవమానించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగదని పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు.

సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

- రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా
-యుటిఎఫ్‌లో చేరిన పలువురు నాయకులు


యుటిఎఫ్‌లో చేరిన వారితో నాయకులు

ప్రజాశక్తి-కాశినాయన (పోరుమామిళ్ల)

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పోరుమామిళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇతర ఉపాధ్యాయ సంఘాలలో పనిచేస్తున్న నాయకులు యుటిఎఫ్‌లో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు సాగిస్తుందన్నారు. పోరాటాల ద్వారా ఎన్నో సౌకర్యాలను ఉపాధ్యాయ లోకానికి సాధించిపెట్టిన ఘనత యుటిఎఫ్‌కే దక్కుతుందన్నారు. పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదన్నారు. ప్రభుత్వం విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి క్రమేపీ తప్పుకుంటున్నదని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల చిన్న చూపును చూస్తున్నారన్నారు. రాబోయే కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపడతామన్నారు. పోరుమామిళ్ల ప్రాంతంలో యుటిఎఫ్ బలమైన సంఘంగా కొనసాగుతుందని, ఇప్పుడు ఇతర సంఘాల నుంచి యుటిఎఫ్‌లో చేరుతున్న నాయకుల వల్ల మరింత బలమైన సంఘంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యుటిఎఫ్‌లో చేరిన వారికి సముచితమైన స్థానం కల్పిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇతర ఉపాధ్యాయ సంఘాలలో మండల స్థాయి నాయకులుగా కొనసాగుతున్న కొందరు తమ సంఘాలలోని పదవులకు రాజీనామా చేసి యుటిఎఫ్‌లో చేరారు. ఇతర ఉపాధ్యాయ సంఘాలకు చెందిన వారితోపాటు మెగా డిఎస్‌సిలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు యుటిఎఫ్‌లో చేరారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలకు చెందిన ఈ.విజయభాస్కర్, కె.గంగరాజు, డి.లక్ష్మీప్రసన్న, ఎస్.కె.మెహతాజ్, కె.ప్రవీణ్ సాగర్, ఎం.శ్రీనివాసులు, జి.ఓబయ్య, డి.ఉమాదేవి, ఎస్.కె.ముస్తర్ హుస్సేన్, ఆర్.బాలయ్య, జి.అనిల్, వి.రవీంద్ర పలువురు చేరిన వారిలో ఉన్నారు. నాయకులకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ లో చేరిన నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఇతర ఉపాధ్యాయ సంఘాలలో పనిచేస్తున్న తాము యుటిఎఫ్ సిద్ధాంతాల పట్ల, విధానాల పట్ల ఆకర్షితులమై చేరామన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తున్న యుటిఎఫ్‌లో చేరడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు కుర్రా చెన్నయ్య, సి.వి.రమణ ఎస్.ఎజాస్ అహ్మద్, జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కె.ప్రసాద్, జిల్లా మాజీ కార్యదర్శి కె.జోజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమణమూర్తి, బి.ఈశ్వరరావు, మహబూబ్ బాషా, జి.బాల ఓబయ్య, వి.భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీధర్ గౌడ్, కొండయ్య, పవన్ కుమార్ పాల్గొన్నారు.

'మొంథా'ను ఎదుర్కొనేందుకు

అధికారులు సన్నద్ధం కావాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఈ నెల 27,28 తేదీలలో భారీ వర్షాలు కురువనున్నాయని, మొంథా తుపాను ఎదుర్కొనేందుకు అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉండాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. ఆదివారం ఆమె ఆర్‌డిఒలు, మండల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్ ప్రభావం జిల్లాపై ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలోని అధికా రులను సమన్వయం చేసుకొని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలలో అవసరమైన అన్ని చర్యలు చేపట్టే విషయంలో ఆర్‌డిఒ పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. గుర్తించిన పునరావాస కేంద్రాలలో మౌలిక వసతులు, తాగు నీరు,ఆహార సరఫరా, విద్యుత్,వైద్య సేవలు అందించాలన్నారు. ప్రమాదకర స్థాయిలో వాగులు, వంకలు పొంగే ప్రాంతాల వైపు ప్రజలు వెళ్ల కుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు, సిబ్బంది 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పంట లను కాపాడుకునే చర్యలతో పాటు చేతికందిన పంట ధాన్యాన్ని గోడౌన్లలో భద్రపరుచుకోవాలన్నారు. పశుసంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఆయా మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పాటు సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తుపాను సహాయక చర్యలకు సిద్ధంగా ఉండా లన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. కడప కలెక్టరేట్‌లో 08562 – 246344లో సంప్రదించాలన్నారు.

జమ్మలమడుగులో వృద్ధ జంట హత్య

- డాగ్ స్క్వాడ్ పరిశీలన
- మృతుడి చిన్న కుమారుడిపై అనుమానం
- త్వరలోనే హంతకుడిని పట్టుకుంటాం
- డిఎస్‌పి వెంకటేశ్వర్లు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జమ్మలమడుగు శివారులో వృద్ధ జంట హత్యకు గురైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం మంచంపైనే వారు విగతజీవులుగా కనిపించారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దపసుపల మోటుకు చెందిన కె. నాగప్ప (60) పట్టణంలోని మైలవరం బైపాస్‌రోడ్డు సమీపంలో సిమెంట్ ఇటుకల బట్టీని నడుపుతున్నాడు. ఇతనికి భార్య ఓబులమ్మ, ఇద్దరు కుమారులు పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు, కుమార్తె ఉన్నారు. నాగప్ప 30 ఏళ్లుగా మరో మహిళ పెద్దక్క(50)తో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ విషయం భార్యతో పాటు కుటుంబ సభ్యులకు తెలుసు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి ఇటుకల బట్టీ వద్ద ఉన్న ఇంట్లో నాగప్ప, పెద్దక్కలు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కట్టెతో ఇద్దరి తలపై గట్టిగా కొట్టి చంపారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి వెంకటేశ్వులు ఆదివారం ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి హత్యపై ఆరా తీశారు. డ్వాగ్ స్క్వాడ్ కూడా వచ్చి మృతదేహాల వద్ద పరిశీలించింది. మృతుల ఇంటి తలుపులు, బీరువా పగులగొట్టినట్లు ఆనవాలు ఉన్నాయని, ఇంట్లో మొత్తం కారం, ధనియాల పొడిని చల్లినట్లు డిఎస్‌పి పేర్కొన్నారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, హంతకులు ఎవరనేది త్వరలోనే పట్టుకుంటామని ఆయన చెప్పారు. చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు అనుమాన స్పదంగా ఉండటంతో అదుపులో తీసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్, డివైఎఫ్ఐ నాయకులు

డ్రగ్స్ రహిత సమాజం కోసం నడుం బిగిద్దాం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం కలిసికట్టుగా పని చేద్దామని ఎస్‌పి నచికేత.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం తన కార్యాలయం లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నో డ్రగ్స్ పోస్టర్స్‌ను ఎస్‌పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో తెలిసీ తెలియని వయస్సులో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని తెలిపారు. యువతకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి వాటికి బానిసవుతున్నారని తద్వారా తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి వాడినా, అమ్మినా నేరమని పేర్కొన్నారు. కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుద్దామని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరణాల.శివకుమార్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలే కాదు యువతకు చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అన్నారు. అందరికీ విద్యా, ఉపాధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. భవిష్యత్‌లో సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు పెద్దన్న పాల్గొన్నారు.

ఎల్ఐసి నిధులు దారి మళ్లింపు దారుణం

ప్రజాశక్తి - కడప

భారత బీమా సంస్థకు చెందిన రూ. 33 వేల కోట్ల నిధులను అదానీ కార్పొరేట్ కంపెనీలకు దారి మళ్లించిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మధ్యతరగతి, పేద ప్రజలు తమ భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సుమారు రూ. 33 వేల క్లోను అదాని కార్పొరేట్ కంపెనీలకు ప్రధాని దారి మళ్లించారని ఆరోపించారు. పర్యవసానంగా ప్రజల సొమ్మును దోపిడీ చేసిన ప్రధానిగా నరేంద్ర మోడీ చరిత్రహీనుడయ్యారన్నారు. ప్రజలు, ఎల్ఐసి ఉద్యోగులు ఎల్ఐసి సంస్థ, దాచుకున్న నిధుల కోసం వెంటనే ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

అదానీకి కట్టబెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసికి చెందిన కోట్లాదిమంది ప్రజల పాలసీ డబ్బులు రూ.34 కోట్లను అదానీకి కట్టబెట్టాలనే ఆలోచనను మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును సిఐటియు తీవ్రంగా పరిగణించి ప్రజా ఉద్యమాన్ని చేపట్టి అడ్డుకుంటుందని తెలిపారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి కార్పొరేట్లకు సేవ చేయడమే పనిగా పెట్టుకుని అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. కేవలం రూ.500 కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో మొదలైన ఎల్ఐసి నేడు దేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజల నమ్మకాన్ని చురగొని వేల కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్ల రూపంలో ఇస్తూ లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న పెద్ద సంస్థగా ఉందని తెలిపారు. ఆ సంస్థను నీరు కార్చడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. ఎల్ఐసికి చెందిన రూ.34 వేల కోట్లను ఆదానికి కట్టబెట్టి ఆలోచనను ఉపసంహరించుకుని, హిడేన్ బర్గ్ రిపోర్ట్ ప్రకారం ఆదాని అక్రమాలపై విచారణ చేసి కఠినంగా శిక్షించాలని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా రద్దు చేసినట్లు కమిషనర్ మనోజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు వర్షాల కారణంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైన సందర్భంలో వెంటనే కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 9949093772కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలని పేర్కొన్నారు.

'వావిలికొలను' బహుముఖ

ప్రతిభకు నిదర్శనం 'మందర వ్యాఖ్య'

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావు బహుముఖ ప్రతిభకు నిదర్శనం' మందర వ్యాఖ్య' అని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ రిటైర్డ్ అధికారి డాక్టర్ పోలుదాసు నరసింహారావు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 148వ సదస్సులో భాగంగా 'ఆంధ్రవాల్మీకి మందర వ్యాఖ్య విశిష్టత' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వావిలికొలను సుబ్బారావు వాసుదాసుగా ప్రసిద్ధులన్నారు. ఆయన వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని 'ఆంధ్రవాల్మీకి రామాయణం' అనే పేరుతో యథాతథంగా పద్యరూపంలో అంటే 24వేల శ్లోకాలను 24వేల పద్యాలతో అనువదించి ఒంటిమిట్ట కోదండ రామునికి అంకితమిచ్చారన్నారు. అందువల్ల ఆయన 'ఆంధ్రవాల్మీకి'గా కొనియాడబడుతున్నారన్నారు. న్యాపతి సుబ్బారావు పంతులు, వావిలాల శివావధానులు ప్రేరణతో వావిలికొలను సుబ్బారావు తాము రచించిన రామాయణానికి 'మందరం' అనే పేరుతో వ్యాఖ్యానాన్ని రచించారన్నారు. రామాయణ విషయంలో కొందరికి ఉన్న సందేహాల గురించి చర్చించారన్నారు. రామాయణకాలం నాటి మనదేశ విభాగం గురించి చెప్పారన్నారు. సీతారామ లక్ష్మణుల సంచార మార్గాలను తెలిపే పటాలను చిత్రించి, శ్రీరాముని దినచర్యను వివరించడం విశేషమన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ పోలుదాసు నరసింహారావును సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి శాలువతో సత్కరించారు. కార్యక్ర మంలో వక్త కుటుంబ సభ్యులు నిర్మల, రేఖ, యజ్ఞప్రియ, విజయకుమార్, రమేశ్, భూపతి రాయల్, రాజారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, కొత్తపల్లి రామాంజనేయులు, కొండూరు జనార్దన రాజు, శ్యామసుందర్ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, శ్రీకాంత్, కుమార్, రఘునాథ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర రెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.


నరసింహారావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

ప్రజాశక్తి - కడప అర్బన్

మొంథా తుపాన్ తీవ్ర రూపం దాల్చినున్నదనే వాతావరణ శాఖ, ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు యుటిఎఫ్ శ్రేణులు, ఉపాధ్యాయులు సిద్ధమవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. తుఫాను సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకుని, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం తీవ్ర రూపం దాల్చి మెంతా తుఫానుగా మారిన నేపథ్యంలో రానున్న రెండు రోజులపాటు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసినందువల్ల అధికారులతో పాటు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రజలకు నష్టం వాటిల్లకుండా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. లారీలు, కార్లు, వ్యాన్లు, బస్సులు, తదితర వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సూచించారు.

దళితులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలోని ఎస్‌సిలకు న్యాయం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని అంబేద్కర్ నేషనల్ విజన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు భవనాసి శివ ప్రసాద్, లోకేష్ కోరారు. ఆదివారం నగరానికి విచ్చేసిన ఎస్‌సి కమిషన్ సెక్రటరీ చిన రాముడును ఆ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది అగ్రకు లస్తులు దళితుల భూములను కాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచిన ఇప్పుడిప్పుడే ఆర్థికంగా బలపడుతున్న దళితులపై మళ్ళీ ఉక్కు పాదం మోపేలా ప్రయత్నిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కేంద్రీ సుధాకర్, అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శివ నాయక్, న్యాయవాది భవనాశి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -కడప : రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేసే కూటమి ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28న కడప నగరంలో జరగబోయే ర్యాలీలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్ బాబు, సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్ క్రీమ్ రవి, అబ్జర్వర్ దాసరి శివప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కోటి సంతకాల సేకరణ, కమిటీల నిర్మాణంపై తొలుత సమావేశం నిర్వహించి అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయివేటీకరణ విధానాన్ని ప్రజలు0 వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ర్యాలీ వైసిపి కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా అధికార ప్రతినిధి, కార్పొరేటర్లు, డివిజన్ అబ్జర్వర్లు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ -2లో విద్యార్థులలో పనులు చేయిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ విద్యార్థుల చేత వార్డెన్ హరికృష్ణ పెద్ద పెద్ద చెట్లను ఎక్కించి కొట్టిస్తున్నారని తెలిపారు. ఇదేమిటని తాము ప్రశ్నిస్తే అడ్డగోలుగా సమాధానం ఇస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి చదువు రీత్యా వచ్చిన వారిని క్రమశిక్షణ, చదువు నేర్పించాల్సిన వార్డెన్ గొడ్డు చాకిరి చేయించడం దుర్మార్గమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్న అక్కడ ఉన్నటువంటి వార్డెన్ విద్యార్థులను బెదిరించి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. వార్డెన్‌పై జిల్లా అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అభినయ్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అఖిలేష్, నవీన్,అద్భుత్ పాల్గొన్నారు.

దేశ్ ముఖ్ సైరా ఖానంకు జాతీయ ఉర్దూ అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్


అవార్డు అందుకుంటున్న సైరాఖానం

నగరంలోని శంకరాపురం ఉర్దూ హైస్కూల్లో భౌతిక శాస్త్రం అధ్యాపకురాలుగా పనిచేస్తున్న దేశ్ ముఖ్ సైరా ఖానంకు జాతీయ ఉర్దూ అవార్డు, బంగారు పతకం అందజేశారు. ఆదివారం ఢిల్లీలోని గాలిబ్ అకాడమీలో క్వామి ఉర్దూ శిక్షక్ కర్మ చారి సంఘ్ భారత అధ్యక్షులు చౌదరి వాసిల్ ఆలీ గురుజార్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు, బంగారు పతకం రావడం సంతోషంగా ఉందని సైరా ఖానం తెలిపారు. ఎంఇఒ, తోటి ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

బిందుసేద్యంతో ఉత్తమ ఫలితాలు

కెఎల్ఎం, భూమియాప్ అప్‌లోడ్ తప్పనిసరి
ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డ్రిప్‌ఇరిగేషన్‌తో ఉత్తమ ఫలితాలు సాధ్యం. దీనికితోడు జిల్లాలో అధికంగా మెట్టప్రాంతాలు ఉండడంతో సూక్ష్మసేద్యానికి పోటీ వాతావరణం పెరుగుతోంది. ఇందులోభాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాం. ఇందులో భాగంగా అర్హులైన రైతుల్లో 80 శాతం మందికిపైగా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సైతం అందించాం. ఏడేళ్ల కిందటి నుంచి జిల్లాలోని 36 మండలాల్లో 162. 5 వేల ఎకరాల్లో బిందుసేద్యం ద్వారా పంటలను సాగు చేయడమైంది. జిల్లాలో పులివెందుల, మైదుకూరు అసెంబ్లీ పరిధిలోని అత్యధిక మండలాల్లో బిందు సేద్యం సాగుకు ఆదరణ పెరుగుతోందని పేర్కొంటున్న ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంక టేశ్వరెడ్డితో ముఖాముఖి...

బిందుసేద్యం పురోగతి ఎలా ఉంది?

2025-26 ఆర్థిక సంవత్సరంలో 37,050 ఎకరాల్లో బిందుసేద్యం చేయడమే లక్ష్యం. ఈఏడాది మార్చి నెలాఖరు నాటికి 28,405 ఎకరాలకు బిందుసేద్యం సదుపాయం అందించే అవకాశం ఉంది.

దరఖాస్తుల వివరాలు తెలపండి?

జిల్లావ్యాప్తంగా 7,800 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయడమైంది. ఈమేరకు 19,266 ఎకరాల్లో సాగు చేయడానికి అవకాశం ఉంది.

సబ్సిడీ వివరాలను తెలపండి?

బిందుసేద్య పరికరాలకు సబ్సిడీ వరిస్తుంది. ఇందులో ఐదె కరాలు లోపు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 100 శాతం, 10 ఎక రాలు కలిగిన మిగిలిన అన్ని కేటగిరీల రైతులకు 90 శాతం చొప్పు న సబ్సిడీ వర్తిస్తోంది.

డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తెలపండి?

ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ప్రాంత ఆర్‌బికె అధికారులు మొదటగా ప్రాథమిక సర్వే, బయోక్యూ చేసిన అనంతరం భూమియాప్, కెఎల్ఎం ఫైల్‌యాప్స్‌లో అప్‌లోడ్ తప్పనిసరిగా చేయాలి. వీటిని ఎపిఎంఐపి పీడీ 10 శాతం, ఎపిడి 10 శాతం, హార్టికల్చర్ అధికారులు 20 శాతం, ఎంఐఎస్‌హెచ్‌జి 10 శాతం, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జులు 10 శాతం చొప్పున క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నిర్ధారిస్తాం.

బిందుసేద్యం ఆదరణకు గల కారణాలేమిటి?

కరువు పీడిత ప్రాంతాలు కావడం, నాణ్యమైన దిగుబడులకు అవకాశం ఏర్పడడం, కలుపు ఖర్చులు కలిసి రావడం తెలిసిందే. దీనికితోడు నీటి ఆదా, ఎరువుల వినియోగ పరిమాణం, విద్యుత్ బిల్లుల్లో తగ్గుదల వంటి అదనపు సౌలభ్యాలు కలిసి రావడం కారణమని తెలుస్తోంది.

డ్రిప్‌ఇరిగేషన్ అత్యధికంగా ఎక్కడెక్కడ సాగులో ఉంది?

జిల్లావ్యాప్తంగా బిందుసేద్యం సాగుకు ఆదరణ లభిస్తోంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పులివెందుల, సింహాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేటతోపాటు పెండ్లిమర్రి, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో బిందుసేద్యం ద్వారా పెద్దఎత్తున పంటలు సాగు చేయడం కనిపిస్తోంది.



ఎంపికైన విద్యార్థులతో ఎంఇఒలు, హెచ్‌ఎం

ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి పోటీ తత్వం అలవర్చుకోవాలని ఎంఇ-1 ఖాదర్‌వలీ పేర్కొన్నారు. సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలో విజేతలుగా ఎస్.అక్షయ (రావుల కొలను), డి.నాగవైష్ణవి (హిమకుంట్ల), అభినయశ్రీ (సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్) విద్యార్థులు మండలస్థాయిలో వరుసగా మూడు బహుమతులు సాధించారు. వీరికి నియోజకవర్గస్థాయిలో ఈ నెల 29న ఇవే పోటీలు నిర్వహిస్తారన్నారు. అక్కడ విజేతలుగా నిలిచిన వారికి అసెంబ్లీలో పాల్గొనే సువర్ణ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శారద, సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సతీష్ కన్నబాబు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నాగాంజనేయులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగాంజనేయులు పేర్కొన్నారు. స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్)-14 విభాగంలో శనివారం గండి గురుకుల పాఠశాలలో జరిగిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. అండర్-14 విభాగంలో కరిష్మా, లావణ్యరెడ్డి, అండర్-17లో కావ్య, సుమశ్రీ, ధరణి, మేఘన, అపూర్వ, అండర్-19లో జయశ్రీ, పల్లవి, నందిని, చంద్రిక, ఆయోషా ప్రతిభ చూపినట్లు వివరించారు. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్లు విజయ భారతి, జయప్రద, ప్రభావతిని హెచ్‌ఎం అభినందించారు.



రాణించిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

క్రీడల్లో చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 బాస్కెట్‌బాల్ క్రీడా పోటీల్లో జివి చరణ్, భారద్వాజ్‌రెడ్డి ప్రతిభ చూపడంతో అంతర్‌జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మనోజ్, పివి చరణ్ స్టాండ్‌బై జాబితాలో ఉన్నట్లు చెప్పారు. పులివెందులలో జరిగిన అథ్లెటిక్స్ డివిజనల్ స్థాయి పోటీలో కూడా ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈవెంట్స్‌లో జావెలిన్ త్రో, హైజంప్, లాంగ్ జంప్, 100, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, డిస్కస్ త్రో పోటీలో గౌతమ్,తేజ వర్ధన్, సంతోష్, అరుణ్‌కుమార్ రెడ్డి, మైనావతి ఎంపికయ్యారని వివరించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా ఇలాగే అద్భుత ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ మార్గదర్శకం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లు పేర్కొన్నారు.

నదీతీర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కుందూ, పెన్నా పరివాహక ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గత వారంలో అధికంగా పడిన వర్షం కారణంగా నదిలో అధిక నీరు ప్రవహిస్తున్నదని, ప్రస్తుతం మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం పడే అవకాశం ఉందన్నారు. నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశాలుంటాయన్నారు. రైతులు రెండు రోజులపాటు వ్యవసాయ పనులు వాయిదా వేసుకోవాలన్నారు. ప్రజలు పాడుబడిన ఇళ్లు, మట్టి మిద్దెలలో నివాసం ఉండకూడదన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఏవైనా ఇబ్బందులు వస్తే వెంటనే వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటూ సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు.

వేముల : మొంథా తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని తహశీల్దార్ రెడ్డి లక్ష్మి సూచించారు. పాత భవనాలల్లో నివాసం ఉండేవారు, రైతులు పంటల పట్ల తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తహ శీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుఫాన్ కంట్రోల్ కేంద్రం ఇన్‌ఛార్జిగా సహాయ గణాంక అధికారి ఎల్.మల్లికార్జునరెడ్డి అందుబాటులో ఉంటారని 83282 89319 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



తహశీల్దార్ రెడ్డి లక్ష్మి

పాపాగ్ని నదిలోకి వెళ్లకుండా ఎర్రజెండాలు

ప్రజాశక్తి - వేంపల్లె

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాలకు పాపాగ్ని నదిలో నీటి ప్రవాహం పెరిగిందని, నదిలోకి ప్రజలెవరూ వెళ్లరాదని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ సూచించారు. ఆదివారం రాత్రి వేంపల్లెలో పాపాగ్ని నది సమీపంలో డిఎస్‌పి ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను పోలీసులు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఏమీ చేయలేమన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐ నర్సింహులు, ఎస్ఐ తిరుపాల్



నది ఒడ్డున ఎర్ర జెండాలను పాతుతున్న డిఎస్‌పి, సిఐ, సిబ్బంది

వరి రైతులకు ఎలుకల బెడద



ఆనందాశ్రమం వద్ద వరి పొలంలో అమర్చుతున్న బుట్టలు

ప్రజాశక్తి - చాపాడు

ఎరువులు, పురుగుమందుల ధరలతో కుదేలవుతున్న రైతులపై ఎలుకలు మరో బెడదగా మారాయి. వాటి నిర్మూలనకు రైతులపై అదనపు భారం తపపడంలేదు. వేల సంఖ్యలో పుట్టుకొస్తున్న ఎలుకలు అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుని నాట్లు వేసిన తర్వాత పైరును పిలక, పొట్ట దశలో కొట్టేస్తున్నాయని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకలను అలాగే వదిలేస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాటి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా మందు పెట్టడం, ఎలుకల బుట్టల ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్ ఎలుకలు పట్టేవారికి ఉపాధినిస్తోంది. వారు గ్రామాల్లో మకాం వేస్తుంటారు. ఒక ఎలుకను పట్టుకుంటే రూ.20 రైతులు చెల్లిస్తున్నారు. వ్యవసాయ శాఖ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాలు నిర్వహించడం లేదని రైతులు వాపోతున్నారు. పెరిగిన ఎలుకల దాడి నేపథ్యంలో రెండు, మూడు సార్లు మందు పెడితేనేగాని వాటి నిర్మూలన సాధ్యం కాని పరిస్థితి. అధికారులు మందును ఉచితంగా పంపిణీ చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు ఎలుకలను నివారించడానికి అదనపు భారం మోయాల్సి వస్తోంది. చాపాడు మండల పరిధిలో 15వేల ఎకరాలలో వరి పైరు సాగైంది. వరిలో అధికంగా ఎలుకలు సంచరిస్తుండడంతో ఎలుకలు పట్టే వారికి మంచి డిమాండ్ ఏర్పడింది. అల్లాడుపల్లె దేవళాల వద్ద ఎలుకలు పట్టేవారు అందుబాటులో ఉన్నారు. ఎలుకల బుట్టలలో వరి ధాన్యం, ఉల్లిగడ్డలను తరిగివేసి పంట పొలాల్లో పెడితే తెల్లవారేసరికి ఎలుకలు బుట్టలలో దర్శనమిస్తున్నాయి. ఒక్క ఎలుకను పట్టుకున్నందుకు రూ.20 రైతులు చెల్లించాల్సి ఉంది. ఇది రైతులపై అదనపు భారం.

ఆ కుటుంబమంతా పోలీసులే..!

తండ్రి, సోదరుడి స్ఫూర్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసిన అనిల్‌కుమార్

ప్రజాశక్తి - లింగాల



ఎస్ఐ అనిల్‌కుమార్

ప్రముఖ కంపెనీలో చేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగం సంతప్తిని ఇవ్వలేదు. తమ కుటుంబంలో ఐదు తరాలకు చెందిన వారు పోలీస్ రంగంలో సేవలు అందించారు. వారిని చూస్తూ పెరిగిన ఆయన ఆ రకంగా సేవలు అందించాలన్నదే తన చిన్ననాటి కల. ఇందుకు ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ మరో వైపు పోలీసు రిక్రూట్‌మెంట్ పోటీలకు సన్నద్ధ మయ్యారు. ఫలితంగా 2024లో ప్రతిభ కనబరిచి ఎస్ఐగా ఎంపికయ్యారు. నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆయన ప్రస్తుతం లింగాల ఎస్ఐ అనిల్‌కుమార్. కర్నూలుకు చెందిన దాసరి దేవిప్రసాద్, విజయకుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు దాసరి అనిల్‌కుమార్. ఆయన విద్యాభ్యాసమంతా కర్నూలులో జరిగింది. కర్నూ లులోనే బిటెక్ పూర్తి చేశారు. తదనంతరం తన కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఆలోచనతో బెంగళూరులోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి, ఏడాది పాటు పనిచేశారు. రూ.లక్షల జీతం తీసుకుంటున్నా సంతృప్తినివ్వలేదు. తన చిన్ననాటి కలను నెరవే ర్చుకునేందుకు తన లక్ష్యంపై గురి పెట్టారు. పోటీ పరీక్షల్లో నెగ్గే విధంగా ప్రణాళికను రూపొందించుకొని పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణతో వివిధ రకాల పాఠ్యపుస్తకాల అంశాలను అందిపుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది నిర్వహించిన ఎస్ఐ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి తన కలను సాకారం చేసుకుని పలువురితో శభాష్ అనిపించుకున్నారు అనిల్‌కుమార్.

ఒకే కుటుంబంలో ముగ్గురూ పోలీసులే..

కొత్తగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ మాట్లాడుతూ. తన తండ్రి ఎఎస్ఐ, సోదరుడు కానిస్టేబుల్‌గా ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇవ్వలేని ఆనందాన్ని పోలీస్ శాఖలో పనిచేయడంతో వచ్చిందన్నారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం తమ కుటుంబం పోలీస్ శాఖ ద్వారా పనిచేయడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యం..

పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి కాగానే పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలలు ట్రయినీ ఎస్ఐగా శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత మొదటి పోస్టింగ్ లింగాల మండలంలో బాధ్యతలు చేపట్టాను. మండల పరిధిలోఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రశాంతతను నెలకొల్పడమే తన లక్ష్యంగా ఎస్ఐ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ముందుగా ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి వాటిల్లో మార్పు తెచ్చేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నానని తెలిపారు. రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్, ప్రజల నుంచి సమస్యల ఫిర్యాదులను స్వీకరించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని తెలిపారు. ఆ దిశగా అడుగులు వేసి ప్రజల్లో మార్పు తీసుకొస్తాను అన్నారు. తన తండ్రి స్ఫూర్తితో శాంతిభద్రతల పరిరక్షణకు నడుం బిగించాను. ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం వారి సలహాలు తీసుకొని తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఎస్ఐ అనిల్‌కుమార్ వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని తెలంగాణ రోడ్డులో కమ్మవారి అన్న సత్రంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలానికి నందమూరి తారక రామారావు ఎన్నో మంచి పనులు చేశారని గుర్తు చేశారు. బ్రహ్మసాగర్ ప్రాజెక్టు, గురుకుల పాఠశాల, ఈ ప్రాంతంలో బ్రహ్మంగారి జీవిత చరిత్ర సినిమా షూటింగ్ చేశారని తెలిపారు. గుంటూరు ఎమ్మెల్యే మాధవి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంత కమ్మ కుటుంబ సభ్యులు, మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు ఎస్ఆర్ శ్రీనువాసులరెడ్డి, పోలిరెడ్డి, పెసల మల్లికార్జునరెడ్డి, చిలమల నారాయణ, పూజ శివయ్య పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

భారీ వర్షాలతో రైతులకు కోలుకోలేని నష్టం జరిగిందని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఏటూరు సమీప ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు జరిగిన నష్టం గురించి ఆరా తీశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇ క్యూఆర్ కోడ్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చు

ప్రజాశక్తి - జమ్మలమడుగు



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ఈ క్యూఆర్ కోడ్‌తో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కల్తీ మద్యం ఘటన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ క్యూఆర్ కోడ్ సిస్టం తెచ్చిందన్నారు. దీని ద్వారా నకిలీ మద్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. నకిలీ మద్యం అని తేలితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మంచి ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. నకిలీ మద్యం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదన్నారు. వైసిపి నాయకులు గత ప్రభుత్వంలో చూసి అవగాహన ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ముద్దనూరు టిడిపి మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, పాండులు, జీకే గైబు, హుస్సేన్ రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

పోలీసు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పోలీసు చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ కార్యక్రమం చేపట్టారు. పోలీసు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, నేర దర్యాప్తు, వైర్‌లైస్ సెట్, సెంట్రీ విధులు, పోలీసు విధులు, ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానం వాటిపై సిఐ వివరించారు. దేశ రక్షణ, ప్రజల శ్రేయస్సు కోసం ప్రాణాలు అర్పించిన పోలీసులను విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అజాగ్రత్తగా బైక్ నడిపిన యువకుడిపై కేసు

వేంపల్లె : అజాగ్రత్తగా మోటర్ బైకు నడిపిన దర్బార్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వేంపల్లెలోని పులివెందుల-గండి బైపాస్ రోడ్డులోని మదీనాపురం సమీపంలో దర్బార్, మరో 5 మంది యువకులు 3 మోటర్ బైకుల్లో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ పెద్దశబ్దం చేయడం, బైకు ముందు చక్రాలను లేపి వెనుక చక్రాలపై నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఆ యువ కులను, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కేసు నమోదు చేసి మోటర్ బైకులపై చర్యలు తీసుకోవాలని పులివెందుల ఎంవిఐకి రాతపూర్వకంగా సూచించామన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు

పులివెందుల రూరల్

రబీ సీజన్‌కు సంబంధించి శనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 25 శాతం రాయితీతో విత్తనాలు అందిస్తుందని ఎఒ చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల మండలానికి 500 క్వింటాళ్ల శనగలు మంజూరైనట్లు తెలిపారు. అవసరమైన వారు రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. శనగలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేసి నమోదు చేయించుకోవాలన్నారు. **లింగాల :** రాయితీ బుడ్డశనగ విత్తనాలు 1,100 క్వింటాళ్ల మంజూ రయ్యా యని ఎఒ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.7,800. రాయితీ రూ.1,950 పోనూ రైతుల వాటా రూ.5,850 చెల్లిం చాలన్నారు. ఒక్క రైతుకు గరిష్ఠంగా 100 కిలోల విత్తనాలు ఇస్తామన్నారు. సంబంధిత రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. **తొండూరు :** తొండూరు రైతులకు సోమవారం నుంచి 25శాతం రాయితీతో శనగ విత్తనాల పంపిణీ చేయుటకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని ఎఒ రాజు తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిఎం సూర్యఘర్‌తో వెలుగులు

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా ప్యానల్ ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వినియోగదారులకు విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం పిఎం సూర్యఘర్‌కు శ్రీకారం చుట్టింది. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునే ఒసి, బిసి వినియోగదారులకు రాయితీ ఇస్తోంది. ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు వంద శాతం ఉచితంగా అమర్చనుంది. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేసి సొంతానికి వాడుకోవచ్చు. మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. ఒకసారి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లు విద్యుత్ పొందే అవకాశం ఉంది. ఈ పథకంపై ఆసక్తి ఉన్న వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తులు విరివిగా వస్తున్నాయి..

మండల వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరానికి 90 యూనిట్లు ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు 15 నుంచి 20 రోజులు లోపల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. కావాల్సిన వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని ఆ శాఖ ఎఇ దినేష్‌కుమార్ కోరారు.

హైటెక్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు..

సోలార్ ప్యానల్స్‌ను హైటెక్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్రభుత్వం దరఖాస్తులను ఆమోదం తెలిపిన వెంటనే అమరుస్తారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. ప్రభుత్వ రాయితీతో ఎలాంటి ఛార్జీలు లేకుండా అమర్చుతాం.

- మురళీమోహన్, హైటెక్ టెక్నాలజీ ప్రతినిధి, సింహాద్రిపురం



గురజాలలో అమర్చిన సోలార్ ప్యానల్స్



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, విద్యార్థులు

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

శ్రీషిరిడి సాయి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం ఎస్.ఉప్పలపాడులో ఆరోగ్యంపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సంజమ్మ గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులు, వెక్టర్ వ్యాధి, టెలి మెడిసిన్, తల్లి, పిల్లల ఆరోగ్యం, 104,108,102ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ద్వారకానాథ్‌రెడ్డి, శ్రీషిరిడి సాయి డిగ్రీ కళాశాల డైరెక్టర్ సంజీవరెడ్డి, 46 మంది ఎన్ ఎస్ఎస్ వాలంటీర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చక్రాయపేట : పంటల సాగులో సేంద్రియ ఎరువును వేస్తే వ్యవసాయ భూమిని కాపాడుకోవచ్చని, అది మనలను రక్షిస్తుందని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దీప్తి తెలిపారు. ఆదివారం గొల్లపలె దళితవాడ గ్రామంలో ట్రిపుల్‌ఐటి విద్యార్థులు యూనిట్ 11, యూనిట్ 15 ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. సోషియా ఎకనామిక్ సర్వే, హెల్త్ అండ్ హైజిన్, ఉమెన్ ఎంపవర్, పరిసరాల శుభ్రత, లిటరసీ, మొక్కలు నాటడం, ఎన్విరాన్మెంటల్ అవేర్నెస్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గోవర్ధన్ తెలిపారు. సేంద్రీయ ఎరువులు తయారు చేసుకుని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. గ్రామంలో ఇంటింటా వెళ్లి రైతులకు అంతర్ పంటలు వేస్తే నేల బలంపెరుగుతుందని అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో మరో కో-ఆర్డినేటర్ సుబ్బరాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - ఖాజీపేట

భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పలు రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిలిందని, ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుంకేసుల సమీప పొలాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను రైతులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 2000 ఎకరాల్లో పత్తిని సాగు చేశారని, నీరు నిలవడంతో పంట ఏమాత్రం పనికిరాదన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20వేల పైబడి ఖర్చు పెట్టారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పంట నష్టపోయిన రైతుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారమందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం అధ్యక్షులు సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసలరెడ్డి, లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

కోటి సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్ జగన్ చేస్తున్న ప్రజా ఉద్యమంలో భాగంగా వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణను పులివెందులలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని సుజాత థియేటర్, జూబ్లీ బస్టాప్, ప్రశాంత్ నగర్, నగరిగుట్ట, పుల్లారెడ్డి హాస్పిటల్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, రంగాపురం మధు, భాస్కర్ రెడ్డి, జశ్వంత రెడ్డి, మహి, అరుణమ్మ, రఫీ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్ మల్లికార్జున, ఎస్టీ నాయకులు అంజనప్ప పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట నారాయణ

పట్రావారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటే లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్రా కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అదే తమ లక్ష్యమని ఎపి పట్రా ప్రగతి సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు ఆదివారం పట్రా రాష్ట్ర అధ్యక్షులు పెద్ద పోతుల హనుమంత రాయుడు, సంఘం గౌరవ అధ్యక్షులు చల్లా వెంకట నారాయణ, గౌరవ అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, జిల్లా అధ్యక్షులు గుజ్జు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, గంగినాయుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్, విజన్ నాయుడు, చిట్టి బాబు, రాము రాణితోపు ఎదురుగా ఉన్న శుభం కల్యాణమండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎవరైతే తమ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్, చట్టసభల్లో అవకాశం కల్పిస్తారో వారికి మాత్రమే రాబోయే ఎన్నికల్లో మద్దతు తెలుపుతామన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఇప్పటి వరకు సాధించిన విజయాలుపై చర్చించారు. సంఘం బలోపేతం కోసం కొన్ని ప్రధాన నిర్ణయాలను తీసుకున్నారు. భవిష్యత్ లక్ష్యాలను సభ్యులకు తెలిపారు. సంఘం బలోపేతం కోసం తీసుకోవలసిన చర్యలు, రాష్ట్ర, జిల్లా కమిటీలకు దిశ నిర్దేశాన్ని పెద్దలు వివరించారు. అఖిల భారత పట్రా ప్రగతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మల్లిఖార్జున సురేష్, వెంకట రామప్ప, చిన్న, ఎల్ఐసి రమణ, వీరప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీధికుక్కలు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వీధికుక్కలను పంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. వీటిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. వీధికుక్కలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజల ఫిర్యాదు మేరకు ఆదివారం పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, ఎస్‌డబ్ల్యూపిసి ఇన్‌ఛార్జి తెలంగాణ వలి ఆధ్వర్యంలో చంద్రగిరికి చెందిన చిట్టిబాబు బృందం వీధికుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇఒ నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కుక్కలు వేంపల్లెలోని స్వైర విహారం చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.

